క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ, ఉపాధ్యాయులు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం డైరీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శిరీష గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీబీ ఈఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు సోమ్లా నాయక్, కార్యదర్శి టి.రమేష్‌బాబు, ఫార్మసిస్ట్ రామచందర్, అజయ్ అమ్మని, సావిత్రి ఏఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణ

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట గ్రామంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో బయ్యారం మండలం అల్లిగూడెం జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజులపాటు హోరాహోరీగా సాగిన పోటీల ముగింపు వేడుక గురువారం నిర్వహించారు. ద్వితీయ స్థానం మేడికుంట, తృతీయ స్థానంలో గుంపెల్లగూడెం గ్రామాలు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ముక్తి కృష్ణ, ధరావత్ వీరేష్, ఊకే కృష్ణ, సూర్నపాక లక్ష్మీనారాయణ, మోకాళ్ల పొట్టయ్య, తోలెం సురేష్, సూర్నపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీఓగా రేవతి



పాల్వంచరూరల్: ఐసీడీఎస్ పాల్వంచ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న కనకదుర్గ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలేనికి బదిలీ కాగా, ఆమె స్థానంలో బూర్గంపాహడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో అసిస్టెంట్ సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న కె.రేవతి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమె పూర్తిస్థాయి సీడీపీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ.. తన పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించే విధంగా కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సింగరేణి(కొత్తగూడెం): ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఖమ్మం పార్లమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ... మరోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం రావాలని అన్నివర్గాల ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. బూత్ అధ్యక్షుడి మొదలుకుని ప్రతీ కార్యకర్త, ప్రతీ నాయకుడు జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో కేవీ రంగాకిరణ్, గల్లా సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జల్లారపు శ్రీనివాస్‌రావు, ప్రభారి బైరెడ్డి, తాటిపాముల ఐలయ్య, మడివి రవి పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: పాపకొల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ప్రజలు ఎలాంటి గొడవలకు వెళ్లొద్దని సూచించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై జీవన్‌రాజు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అయ్యేనా?

- బకాయి చెల్లిస్తేనే కొత్త అప్పులు
- పాస్‌పుస్తకాలు లేనివారికి మొండిచేయి
- రుణాలు వసూలు చేయడం లేదని సొసైటీలో సిబ్బంది జీతాలు నిలిపివేత



ఇల్లెందు పీఏసీఎస్ కార్యాలయం

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అధినాయకత్వం ప్రకటించింది. కాంగ్రెస్ విజయం సాధించడంతో రుణాలు మాఫీ అవుతాయని రైతులు భావించారు. ఎలాగూ రుణాలు మాఫీ అవుతున్నాయని బ్యాంకుల్లో రైతులు రీషెడ్యూల్ చేసుకుంటూ కొత్త అప్పులు తీసుకుంటున్నారు. కానీ సహకార పరపతి సంఘంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రుణాల రీషెడ్యూల్‌లోనూ బ్యాంకర్లు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. రుణం పూర్తిగా చెల్లించాలని ఇంటిచుట్టూ తిరుగుతుండటతో అన్నదాతలు ముఖం చాటేయాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆదేశాల మేరకు సొసైటీలలో అమలవుతున్న నిబంధనలు తమకు గుదిబండగా మారాయని రైతులు వాపోతున్నారు.

మండలంలో రూ.5 కోట్ల రుణాలు...

మండలంలో ప్రాథమిక సహకార సంఘంలో మొత్తం 2,396 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 760 మందికి ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయి. 1,636 మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు లేవు. వీరందరికీ ఇప్పటి వరకు బ్యాంకు నుంచి రూ.5 కోట్ల వరకు పంట రుణాలు మంజూరయ్యాయి. ఇలా ఏటా బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంటూ రైతులు తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన రూ.5కోట్ల రుణంలో ఇప్పటి వరకు రూ.90 లక్షలు మాత్రమే రైతులు చెల్లించారు. ఇంకా రూ.4.10 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.

రీషెడ్యూల్‌లో కిరికిరి...

ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ప్రాథమిక సహకార సంఘం పరిధిలో రైతులు తీసుకున్న రుణాలన్నీ రూ.2లక్షలకు లోపుగానే ఉండటంతో రుణమాఫీ అందరికీ వర్తించే అవకాశం ఉంటుంది. దీంతో రైతులు బకాయి చెల్లించడం కంటే రీషెడ్యూల్ చేసుకునేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఇక్కడే బ్యాంకు అధికారులు కిరికిరి పెడుతున్నారు. కేవలం పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగి ఉన్న వారికి మాత్రమే రుణాల రీషెడ్యూల్ చేస్తూ పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని వారికి మాత్రం రీషెడ్యూల్ చేయడం లేదు. అంతేకాకుండా బకాయి పూర్తిస్థాయిలో చెల్లించాలని రైతులపై బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పాస్‌పుస్తకాలు లేని రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకు ప్రతిఏటా పాస్‌పుస్తకం లేకున్నా కొత్త రుణాలు ఇవ్వడం, రీషెడ్యూల్ చేయడం వంటి ప్రక్రియ సాఫీగా చేసిన అధికారులు ఈసారి కొర్రీలు పెట్టడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సిబ్బంది వేతనాలు నిలిపివేత..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణాల పేరిట రైతులకు పంపిణీ చేసిన రూ.5కోట్ల రుణాలను తిరిగి రికవరీ చేయాలని సిబ్బందిని బ్యాంకు ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో బ్యాంకు సిబ్బంది ప్రతీరోజు రైతుల ఇళ్లకు వెళ్లి బకాయి చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ రైతులు బకాయిలు చెల్లించేందుకు నిరాకరిస్తున్నారు. అయినా అదే పనిగా సిబ్బంది తమ ఇళ్ల వద్దకు రావడం రైతులకు సమస్యగా మారింది. ఇదిలా ఉండగా బకాయిలు కనీస స్థాయిలో కూడా వసూలు చేయలేదని ఆగ్రహిస్తూ సిబ్బందికి జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి వేతనాలు నిలిపివేశారు. ప్రభుత్వం చేసిన రుణమాఫీ ప్రకటనతో ఇటు రైతులు బకాయిలు చెల్లించక.. వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

పోడు పట్టాలకు అందని రుణాలు...

ఇల్లెందు ప్రాథమిక సహకార పరపతి సంఘంలో పోడు పట్టాలు ఉన్న రైతులు సభ్యులుగా ఉన్నారు. పోడు పట్టాలు పంపిణీ చేసిన సమయంలో కేవలం 100 మందికి రుణాలు ఇచ్చిన అధికారులు ఆ తరువాత రుణాలు మంజూరు చేయడం నిలిపివేశారు. ఇతర బ్యాంకులలో పోడు రైతులకు రుణాలు ఇస్తున్నప్పటికీ సొసైటీలో రుణాలు ఇవ్వకపోవడంతో పోడు రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణాలతో రైతులు సొసైటీలలో తమ ఖాతాలను రద్దు చేసుకొని ఇతర బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. తాజా పరిణామాలతో ఈసంఖ్య క్రమంగా పెరుగుతుండటం బ్యాంకు భవితవ్యంపై ప్రభావం చూపుతుందని పలువురు రైతులు, నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోడు పట్టా ఉన్నా రుణం ఇవ్వట్లేదు..



మా కుటుంబానికి ప్రభుత్వ పట్టాలు లేవు. దీంతో పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం ఇటీవల పోడు పట్టాలు మంజూరు చేసింది. పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న తమకు పోడు పట్టాలు మంజూరైనా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయడం లేదు.

– బానోత్ నాగేశ్వరరావు, వేపలగడ్డ తండా

అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు



మాకు పోడు ఉంది. ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసింది. చాలా సంవత్సరాలుగా పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉండటం వల్ల ప్రతీ ఏడాది అప్పు తీసుకుంటున్నాం. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామనడంతో అప్పు చెల్లించలేదు. కానీ బ్యాంకు సిబ్బంది రుణం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు.

– ధరావత్ రమేష్, వేపలగడ్డ

అధికారుల ఆదేశాలు పాటిస్తున్నాం..



రుణాల రికవరీ, కొత్త రుణాల మంజూరు విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేస్తున్నాం. పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న వారికి మాత్రమే రీషెడ్యూల్ చేస్తున్నాం. మిగతావారు పూర్తిగా బకాయిలు చెల్లించాల్సిందే. పోడు భూములకు రుణాలు ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నాయి.

– లక్ష్మయ్య, మేనేజర్, డీసీసీబీ ఇల్లెందు బ్రాంచి

పంట రుణాలు చెల్లించండి



మాట్లాడుతున్న మేనేజర్ ప్రవీణ్

సుజాతనగర్: ఈ నెల 28 లోగా గతంలో తీసుకున్న పంట రుణాలను చెల్లించాలని ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ అన్నారు. స్థానిక బ్యాంకులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల క్రితం తీసుకున్న రుణాలు రూ.2 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. సుమారు 245 మంది రైతులు తమ రుణాలను చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి రుణమాఫీ వస్తుందనే కారణంతో రైతులు తమ రుణాలు రెన్యూవల్ చెయించుకోవడానికి ముందుకు రావడం లేదన్నారు. రైతులు వారి రుణాలు రెన్యూవల్ చేసుకున్నా రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు. గడువులోగా పంట రుణాలు చెల్లిస్తే ఓటీఎస్ స్కీం కింద 20 నుంచి 50 శాతం వరకు సబ్సిడీని పొందవచ్చన్నారు. రుణాలు చెల్లించే సామర్థ్యం కలిగిన రైతులు కూడా రెన్యూవల్ చేసేందుకు ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 28 లోగా రైతులు తప్పకుండా రుణాలు చెల్లించాలని, లేనిపక్షంలో మొండి ఖాతాదారునిగా, రుణ ఎగవేతదారునిగా గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు సీహెచ్ రమేష్, జె.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా పట్టణ అధ్యక్షుడిగా రాహుల్

ఇల్లెందు: బీజేపీ యువ మోర్చా ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా వి.రాహుల్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం పట్టణ అధ్యక్షుడు కె.సంజీవరెడ్డి నియామకపత్రం అందజేశారు. రాహుల్ నియామకం పట్ల జిల్లా కార్యదర్శి సందీప్, దోమల మహేష్, మావునూరి మాదవ్, శివకుమార్, నాగరాజు, రజత్‌కోరీ, కొలారియా తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్

జూలూరుపాడు: మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. వినోభానగర్ నుంచి పాపకొల్లుకు అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు 100కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో జూలూరుపాడు ఎస్ఐ జీవన్‌రాజు తన పోలీస్ సిబ్బందితో వెళ్లి రెండు ట్రాక్టర్లను కొత్తూరు గ్రామంలో పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మైనార్టీలకు ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్‌కు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఉచిత శిక్షణ అందిస్తోందని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎం డీ.యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12 లోపు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి ఏప్రిల్ 28న జిల్లా కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల స్కూళ్లలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడుతుందని, మెరిట్‌ను బట్టి ఈ శిక్షణ అందించనున్నారని తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఇల్లెందురూరల్: సీఎస్పీ బస్తీలో అనాథ శవానికి పోలీసు, గ్రామపంచాయతీ సిబ్బంది గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కొంతకాలంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి అడుక్కుంటూ జీవిస్తున్న వ్యక్తి గురువారం ఉదయం మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమా చారం మేరకు పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు కానిస్టేబుల్ నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

స్వర్గధామం అభివృద్ధి కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

పాల్వంచ: పట్టణంలోని కేటీపీఎస్ పక్కనున్న స్వర్గధామం శ్మశానవాటిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం శాస్త్రీరోడ్‌లోని ఆర్‌జీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా సాయిని కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

అదేవిధంగా గౌరవ అధ్యక్షుడిగా కొత్వాల శ్రీనివాసరావు, సలహాదారుడిగా రావూరి నాగేశ్వరరావు, అడుసుమల్లి సాయిబాబు, కాపర్తి వెంకటాచారి, జాలే జానకిరెడ్డి, దొడ్డా రవికుమార్, సాధం రామకృష్ణారావు, ఎర్రంశెట్టి ముత్తయ్య, ఉపాధ్యక్షుడిగా కొండం వెంకన్న, ఇంటూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

రంగంలోకి పందెం రాయుళ్లు

పాల్వంచరూరల్: క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్న ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేటి నుంచి ప్రారంభం కానుంది. దీంతోపాటు బెట్టింగ్‌లు కూడా జోరుగా సాగనున్నాయి. ఐపీఎల్ క్రికెట్ పోటీలు రెండునెలలపాటు అభిమానులను అలరించనున్నాయి. తొలి మ్యాచ్ శుక్రవారం రాత్రి 7.30 గంటలకు చైన్నై సూపర్ కింగ్స్, ఆర్‌సీబీ జట్ల మధ్య జరగనుంది. గత సీజన్‌లో జరిగిన ఐపీఎల్ క్రికెట్ పోటీలకు రూ.లక్షల బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోయిన పరిస్థితులు ఉన్నాయి. పాల్వంచలో ఓ యువకుడు వరకట్నం డబ్బులను కూడా బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడు. దీంతో భార్యభర్తలు విడిపోయే పరిస్థితికి దారి తీసిన సంఘటనలు ఉన్నాయి. తల్లిదండ్రులకు తెలియకుండా యువకులు, విద్యార్థులు సెల్‌ఫోన్ యాప్‌లల్లో రుణాలు తీసుకుని బెట్టింగ్‌లకు పాల్పడ్డి అప్పులపాలై ఇళ్లు వదలి వెళ్లినవారు ఉన్నారు. తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలైనవారు కూడా ఉన్నారు. గతంలో పోలీసులకు పట్టుబడిన వారే మళ్లీ బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా ఆన్‌లైన్, స్మార్ట్‌ఫోన్ యాప్‌ల ద్వారానే కొనసాగుతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఒక జట్టుపై వెయ్యి రూపాయలు బెట్టింగ్ పెడితే ఆ జట్టు గెలిస్తే రెండింతలు ఇస్తామని చెబుతున్నట్లు సమాచారం.

బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు..



ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్‌ల వలన ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా కుటుంబాలు కూడా దెబ్బతింటాయి. తల్లిదండ్రులు పిల్లలను బెట్టింగ్‌లకు పాల్పడకుండా ఓ కంట కనిపెట్టాలి. ముఖ్యంగా విద్యార్థులు క్రికెట్ పోటీలను టీవీల్లో చూడొచ్చు కానీ బెట్టింగ్‌ల జోలికి అస్సలు వెళ్లొద్దు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతుంటే సమాచారం ఇవ్వాలి.

– వినయ్‌కుమార్, సీఐ, పాల్వంచ

జనక్ ప్రసాద్‌కు సన్మానం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వివిధ ఏరియాల ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు జనక్ ప్రసాద్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ... జనక్ ప్రసాద్ సింగరేణి కార్మికులకు కొన్నేళ్లుగా చేస్తున్న సేవలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం మినిమమ్ వేజెస్ అడ్వయిజరీ బోర్డ్ చైర్మన్‌గా నియమించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో సంఘటిత, అసంఘటిత కార్మికులతోపాటు, సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు మినిమమ్ వేజ్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జనక్ ప్రసాద్‌కు ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగురు ప్రసిడెంట్ కృష్ణంరాజు, ఇల్లెందు ఏరియా వైస్ ప్రసిడెంట్ వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ ధర్మపురి, సెంట్రల్ జనరల్ సెక్రటరీ వంగా లక్ష్మీపతిగౌడ్, సెంట్రల్ క్యాంపెయినింగ్ ఇన్‌చార్జ్ వికాస్ కుమార్, ఆర్జి–3 నాయకులు ఉయ్యాల కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్‌తో అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్ పై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీరమ్య

కొత్తగూడెంఅర్బన్: వంటింటిలో నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు జరుగుతాయని బాబుక్యాంపు ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు షేక్ దస్తగిరి అన్నారు. గురువారం శ్రీలక్ష్మి భారత్ గ్యాస్ పెనగడప వారి ఆధ్వర్యంలో బాబూ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్యాస్ వినియోగంపై నిర్వాహకులు లక్ష్మీరమ్య, అన్వేష్‌గుప్తా విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్యాస్ వినియోగంలో సేఫ్టీ క్లినిక్ పేరుతో సంరక్షణ చర్యలను గురించి వివరించారు. దస్తగిరి మాట్లాడుతూ... గ్యాస్ వాడకం ఎంత సౌకర్యం కలిగిస్తుందో, అలాగే అంత ప్రమాదకరమైందని కూడా అని, వంటింట్లో ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు జరుగుతాయని పేర్కొన్నారు. గ్యాస్ వినియోగంపై పాఠశాలను ఎంచుకొని విద్యార్థులకు అవగాహన కల్పించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. తెలుసుకున్న విషయాలను ఇంటి వద్ద వారి తల్లిదండ్రులకు కూడా తెలపాలని విద్యార్థులకు సూచించారు. అంతకు ముందు పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, విజయశ్రీ, జ్యోతి, శ్రీదేవి, పుష్పరాణి, ఉషారాణి, ఏసురత్నం పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని ప్రామాణికంగా తీసుకోండి..



జీఎం కోటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పీవీకే – 5 షాఫ్ట్ నుంచి జేవీఆర్‌ఓసీకి డిప్యూటేషన్‌పై పంపించే వారికి ఆరోగ్య పరిస్థితులను ప్రామాణికంగా పాటించాలని కొత్తగూడెం ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డికి గురవారం సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జేవీఆర్ ఓసీకి 50 మంది జనరల్ మజ్దూర్లు అవసరం ఉందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోమని నోటీస్ బోర్డ్ ద్వారా తెలిపారని పేర్కొన్నారు. చాలాకాలం అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న వారు మైన్‌లో దిగలేక ఇబ్బంది పడుతున్న వారిని, ప్రమాదాలకు గురైన వారిని, బయట రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి, అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారిని మెడికల్ రిపోర్ట్, సీనియారిటీ ఆధారంగా పరిగణలోకి తీసుకోవాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎస్ఓటూ జీఎం సానుకూలంగా స్పందించి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

నిబద్ధత కలిగిన వ్యక్తి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: వృత్తి పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి సీనియర్ న్యాయవాది బొల్లేపల్లి లక్ష్మీనారాయణ అని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ హాజరై నివాళులర్పించారు. మాట్లాడుతూ... న్యాయమూర్తులను సైతం బొల్లేపల్లి మార్గదర్శనం చేసేవారని కొనియాడారు. కమ్యూనిస్టుల ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాలు ఇమిడి ఉన్న కేసుల్లో సైకిల్‌పై ఇల్లెందు, ఏటూరు నాగారం సైతం వెళ్లి కేసులు వాదించారని, కొండపల్లి పవన్ అన్నారు. వైరా ఎమ్మెల్యే బానోతు రాందాస్ మాట్లాడుతూ... బొల్లేపల్లి అనేక సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు వాదించారని, వాటిలో అత్యధిక సంఖ్యలో విజయం సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్, బత్తుల కృష్ణయ్య, ఎంఎస్ రెడ్డి, తాళ్లూరి వెంకటేశ్వరరావు, ఎంవీ వరప్రసాద్, చంద్ర పూర్ణచందర్‌రావు, వెంకటరత్నం, పలివేల సాంబశివరావు, కె.పుల్లయ్య, ఎస్.రమణారెడ్డి, జీవీకే మనోహర్‌రావు, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీఓ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి మందగించటం, బరువు తగ్గటం, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడటం వంటివి ఉంటే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిర్ధారణ జరిగితే క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని చెప్పారు. అనంతరం స్వాతి ఎన్జీవో కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి, పీడియాట్రిక్ టీబీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాధామోహన్ అధ్యక్షతన మెడికల్ ఆఫీసర్స్, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల ప్రాముఖ్యతను తెలుసుకోండి



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు



ఇల్లెందు: అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

జూలూరుపాడు: అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రసాద్‌రావు మాట్లాడుతూ అడవులు అంతరించిపోవడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాలని సూచించారు. అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభద్ర, ఉపాధ్యాయుడు రమేష్, డీఆర్ఓ లక్ష్మీనర్సు, ఎఫ్‌బీఓలు విజయలక్ష్మి, కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ అమరవీరులకు నివాళులర్పించి వారి సేవలను మననం చేసుకున్నారు. గురువారం ఇల్లెందు ఎఫ్‌డీఓ కార్యాలయ ఆవరణలోని అటవీ అమరవీరుల స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ సంస్థ జిల్లా సమన్వయకర్త సతీష్ ఖండేల్‌వాల్, ఏకల్ అభియాన్ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పలరాజు, డీఆర్ఓ సాల్మాన్ రాజ్, బీట్ ఆఫీసర్లు ఝాన్సీ, శాంతి పాల్గొన్నారు.